

బాధితులకు అభయం.. నేరస్తులకు భయం

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'కోర్టు మానిటరింగ్ సెల్' సత్ఫలితాలిస్తోంది. బాధితులకు సత్వర న్యాయం అందిస్తోంది. -8లో



హోటల్‌పై విజిలెన్స్ దాడులు

సిద్ధవటం మండల పరిధి మాధవరం-1 గ్రామంలోని హోటల్‌పై విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఐదు సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 124 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

సిద్దవటం: సిద్దవటంలోని జెడ్పీ హైస్కూల్‌లో శనివారం జవహర్ నవోదయ ప్రవేశపరీక్ష ప్రశాతంగా జరిగింది. ఈ సందర్భంగా ఎగ్జామినర్ చీఫ్ శ్రీరాములు మట్లాడుతూ జవహర్ నవోదయ పాఠశాలలో 6వ తరగతి చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షకు సిద్దవటం, అట్లూరు, ఒంటిమిట్ట మండలాలకు చెందిన మొత్తం 231 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరిలో 176మంది ప్రవేశ పరీక్షకు హాజరయ్యారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిపార్టమెంటల్ చీఫ్ అరుణ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కులగణన సర్వే పకడ్బందీగా చేపట్టాలి

గాలివీడు: మండలంలో కుల గణన సర్వే పకడ్బందీగా చేపట్టాలని అన్నమయ్య జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (సీపీఓ) కృష్ణా నాయక్ తెలిపారు. శనివారం గాలివీడు-2 గ్రామ సచివాలయం పరిధిలోని చిలకలూరిపేటలో సచివాలయ ఉద్యోగులు , వలంటీర్లు చేస్తున్న కుల గణన సర్వేను పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో జనవరి 28 నాటికి కుల గణన సర్వే క్షేత్రస్థాయిలో పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషణ్‌రెడ్డి, ఏఓ జాబీర్ అహమ్మద్, పంచాయతీ కార్యదర్శి రాధికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో టాప్ టెన్ కళాశాలగా మిట్స్



గుర్తింపు పత్రాన్ని అందుకుంటున్న పృథ్వీరాజన్

కురబలకోట: మండలంలో అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో టాప్ టెన్ కళాశాలగా గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. జాతీయస్థాయిలో ఎన్‌పీటీఈఎల్ ఆన్‌లైన్‌లో జూలై, డిసెంబరు-23 సెషన్‌లో నిర్వహించిన పరీక్షల్లో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు 6338 సర్టిఫికెట్ కోర్సులకు హాజరయ్యారు. ఇందులో 5538 మంది ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయిలో ఎన్‌పీటీఈఎల్ సర్టిఫికెట్లు పొందారు. దీంతో కళాశాలకు ట్రిపుల్ ఏ రేటింగ్, టాప్ టెన్ కళాశాలగా గుర్తింపు లభించినట్లు చెప్పారు. చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జరిగిన అవార్డుల కార్యక్రమంలో కళాశాల మెకానికల్ ప్రొఫెసర్ డాక్టర్ పృథ్వీరాజన్ గుర్తింపు పత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు

రాయచోటి టౌన్: జిల్లా కేంద్రమైన రాయచోటి వాహనాల తనిఖీ కార్యాలయంలో 35వ జాతీయ భద్రతా వారోత్సవాలను శనివారం ప్రారంభించారు. జిల్లా వాహనాల తనిఖీ అధికారి దినేష్ చంద్ర (ఎఫ్‌ఏసీ) ఆధ్వర్యంలో దీనికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా హాజరయ్యారు. వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని డ్రైవర్లకు సూచించారు. వాహనాల తనిఖీ అధికారి దినేష్ చంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాహనానికి సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని చెప్పారు. డ్రైవింగ్ సీట్‌లో కూర్చోగానే సీట్ బెల్ట్ తప్పకుండా ధరించాలన్నారు. లైసెన్స్ కలిగి ఉన్న వారే వాహనాలు నడపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈఈ గిరీశ్వరావు, ఎన్‌హెచ్ఏఐ ఏఈఈ రఘునాథబాబు, రాయచోటి వాహనాల తనిఖీ అధికారులు బి.సుబ్బరాయుడు, జె. అనిల్ కుమార్, ఏఎస్ఐ జోసెఫ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యం..బలోపేతం

- పీహెచ్‌సీల్లో 63 రకాల పరీక్షలు చేసే సదుపాయం
- అందుబాటులోకి ఆధునాతన పరికరాలు
- ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ పూర్తి



మదనపల్లె మండలం బొమ్మనచెరువు పీహెచ్‌సీ



ప్రభుత్వఆస్పత్రికి వచ్చిన ఆధునిక పరికరాలు

మదనపల్లె సిటీ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రూపురేఖలు మారుతున్నాయి. ఇది వరకు పరిమిత పరీక్షలకే పరిమితమైన పీహెచ్‌సీలు ఇప్పుడు 63 రకాల వైద్య పరీక్షలు చేసే స్థాయికి ఎదిగాయి. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో మౌలిక వసతులు కల్పిస్తోంది.దీంతో జిల్లాలో ఉన్న 49 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో రక్త పరీక్షలు పూర్తి స్థాయిలో చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పీహెచ్‌సీలో రక్తపరీక్ష చేయించుకుంటే మూడు రోజులుకు కానీ ఫలితాలు అందేవి కాదు. అప్పట్లో ల్యాబ్ టెక్నీషియన్లు కూడా ఉండేవారు కాదు. నేడు పరిస్థితులు మారాయి. ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 63 రకాల రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందు కోసం ల్యాబ్‌టెక్నీషియన్లకు శిక్షణ ఇచ్చారు. రిపోర్టులు కూడా నిమిషాల్లో వస్తున్నాయి. దీని ఆధారంగా వైద్యులు మందులు ఇస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా సజావుగా పీహెచ్‌సీలోనే జరుగుతుండటంతో రోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- ప్రస్తుతం పీహెచ్‌సీలలో ఎలక్ట్రోలైట్ ఎనలైజర్, సెమీ ఆటో బయోకెమిస్ట్రీ ఎనలైజర్, యూరిన్ ఎనలైజర్, మైక్రోస్కోప్, ఈఎస్ఆర్ ఎనలైజర్, ఫ్యూజ్, టీబీ ఆర్‌టీపీసీఆర్, సీబీసీ వంటి పరికరాలు అందుబాటులో వచ్చాయి.
- సీఆర్‌పీ, ఎన్‌జీఓటీ, యూఆర్ఈఏతో పాటు హిమోగ్లోబిన్, ప్లేట్‌లెట్ కౌంట్, సీబీసీ టోటల్ బ్లెడ్ సెల్ కౌంటర్, ర్యాండమ్ బ్లడ్ షుగర్, బ్లడ్ యూరియా, సీరం సోడియం, హెచ్ఐవీ, హెపటైటిస్-బీ, డెంగీ, మలేరియా, బ్లీడింగ్, క్లాటింగ్ టైమ్, థైరాయిడ్, పోటాషియం క్లోరైడ్ తదితర 63 రకాల పరీక్షలు చేస్తున్నారు.

శ్రమ, ఖర్చు తగ్గింది



మా పాపకు జ్వరం వస్తుంటే ఆస్పత్రికి వచ్చాను. అన్ని రకాల రక్తపరీక్షలు చేశారు. ఇవే రక్తపరీక్షలు బయట చేయించుకోవాలంటే ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఎలాంటి శ్రమ, ఇబ్బంది,ఖర్చు లేకుండా ఉచితంగా రక్తపరీక్షలు చేస్తున్నారు.చాలా సంతోషంగా ఉంది. -బావానాయక్, ఆర్ఎస్ తాండా, తంబళ్లపల్లె మండలం

పేదలకు ఎంతో మేలు



ఆస్పత్రికి వచ్చిన వెంటనే అవసరమైన వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఇవే రక్తపరీక్షలకు బయట రూ. 600 వరకు వెచ్చించాల్సి వచ్చేది. ఇప్పుడు వైద్యుని సలహా మేరకు ఉచితంగా చేస్తున్నారు. గతంలో ఆస్పత్రిలో రావాలంటే నిస్పృహగా ఉండేది. ఇప్పుడు ఏ ఇబ్బంది కలిగినా ఆస్పత్రికి వచ్చి వైద్యం తీసుకుంటున్నాం. వైద్యులు కూడా అందుబాటులో ఉన్నారు. మాలాంటి పేద రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు అందుతున్నాయి. బాబ్‌జాన్, గౌసియావీధి, మదనపల్లె

అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తున్నాం



అవసరం మేరకు అన్ని పరికరాలు ప్రభుత్వం చేస్తుంది. వచ్చిన రోగులకు అవసరమైన మేరకు రక్తపరీక్షలు చేస్తున్నాం. పట్టణాలకు, ప్రైవేటు ల్యాబ్‌లకు రోగులు వెళ్లాల్సిన పరిస్థితి లేదు. రోగులు సక్రమంగా వినియోగించుకోవాలి. -డాక్టర్ వెంకటరామయ్య, మెడికల్ ఆఫీసర్, తంబళ్లపల్లె

వైవీయూలో ఓబీసీ సెల్ వెబ్ సైట్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ఇతర వెనుబడిన తరగతుల (ఓబీసీ) విభాగం బ్రోచర్‌ను, వెబ్‌సైట్‌ను విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రధానాచార్యులు ఎస్. రఘునాథ్ రెడ్డితో కలసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైవీయూ ఓబీసీ సెల్ డైరెక్టర్ డా కె ఎస్ వి కష్ణారావు, సభ్యులు డా. బి. గంగయ్య, డా. జి పార్వతి, ఎం. సరళ ఆధ్వర్యంలో ఓబీసీ విభాగం పని చేస్తుందని తెలిపారు. ఓబీసీ విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ రిజర్వేషన్ ,లక్ష్యసాధనకు అవసరమైన మార్గాలను ఈ విభాగం సూచిస్తుందన్నారు. డైరెక్టర్ డాక్టర్ కె.ఎస్.వి కష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులకు, అధ్యాపకులకు, బోధనేతర సిబ్బందికి అవసరం విద్య, పరిపాలన పరమైన ఫిర్యాదులను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఐటీ సెల్ సంచాలకులు ఆచార్య ఎం.వి. శంకర్, ఐక్యూఏసి సంచాలకులు డాక్టర్ సుబ్రమణ్యం శర్మ పాల్గొన్నారు.

సౌమ్యనాథుడి సేవలో కేంద్ర పర్యాటకశాఖ సలహాదారు



ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న కేంద్ర పర్యాటక శాఖ సలహాదారు సుమేర్‌సింగ్ సోలింకి

నందలూరు(రాజంపేట): నందలూరు శ్రీసౌమ్యనాథస్వామిని పార్లమెంట్ సభ్యుడు (రాజ్యసభ), కేంద్ర పర్యాటకశాఖ సలహాదారు సుమేర్ సింగ్ సోలింకి శనివారం రాత్రి దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్, రాష్ట్ర నాయకులు నాగోతు రమేష్ నాయుడు, మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు షబ్బీర్ అహ్మద్, అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్, గిరిజన మోర్చా నాయకులు పోతురాజు మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కడపలో శ్రీరామ శోభాయాత్ర

కడప కల్చరల్: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో ఆదివారం కడప నగరంలో శ్రీరామ శోభాయాత్ర ఘనంగా నిర్వహించనున్నారు. హిందూ భక్తులంతా అయోధ్య ఐక్యతా వేదిక పేరిట ఈ యాత్ర చేపట్టనున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ యాత్ర జరుగుతుంది. చిన్నచౌకులోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి యాత్ర ప్రారంభంకానుంది. నగరంలోని పలు కూడళ్ల మీదుగా యాత్ర సాగి హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండరామస్వామి ఆలయం వద్దకు చేరుకున్నాక ముగుస్తుంది. రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రముఖులంతా యాత్రకు తోడ్పాటు ఇస్తున్నారు. ప్రత్యేకంగా తెప్పించిన 18 అడుగుల శ్రీరాముడి విగ్రహాన్ని కొలువుదీర్చి ప్రత్యేక ఆకర్షణగా ర్యాలీలో నిలుపనున్నారు.

రాజంపేటవాసుల కల నెరవేరింది

- ఎమ్మెల్యే మేడా, జెడ్పీచైర్మన్ ఆకేపాటి
- రాజంపేటలో వందపడకల ఆసుపత్రి ప్రారంభం



వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడామల్లికార్జునరెడ్డి, జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట: లోక్‌సభ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో వందపడకల ఆసుపత్రి ఏర్పాటుతో పేదరోగుల కల నెరవేరింది. రూ.23కోట్ల వ్యయంతో ఆధునికవైద్యం అందించేలా భవనాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో శనివారం పెద్దాసుపత్రి ప్రారంభోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి సంయుక్తంగా ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రంలో వందపడకల ఆసుపత్రి అన్ని హంగులతో అందుబాటులోకి వచ్చిందన్నారు. కార్పొరేట్ వైద్యం అందించే విధంగా వివిధ రకాల ప్రత్యేక చికిత్స విభాగాలను ఇక్కడ ఏర్పాటుచేశారన్నారు. వైద్యులు, సిబ్బంది, మందుల కొరత లేకుండా అన్ని చర్యలను సెకండరీ హెల్త్ అధికారులు తీసుకున్నారన్నారు. గతంలో పెద్దాసుపత్రి దయనీయపరిస్థితులో ఉండేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో దీని రూపురేఖలు మారిపోయాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఖరీదైన వైద్యాన్ని ప్రభుత్వాసుపత్రుల్లోనే అందించేలా తీసుకున్న చర్యల ఫలితంగా ఈ రోజున రాజంపేటలో కార్పొరేట్ హాస్పిటల్ తరహాలో ప్రాంతీయ వైద్యశాలను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. పేదల పక్షాన నిలబడిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, రానున్న ఎన్నికల్లో ఆయనకు అండగా నిలవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మున్సిపాలిటి చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, వైస్‌చైర్మన్ మర్రి రవి, డీసీహెచ్‌లు డేవిడ్, హిమదేవి, డీఎంహెచ్‌వో కొండయ్య,ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ జయచంద్రారెడ్డి, డీఈ రాజగోపాల్, సూపరింటెండెంట్ డా.పీవీఎస్‌రాజు, హెచ్‌డీసీ సభ్యులు ఉమామహేశ్వరరెడ్డి, ఎరుకల్వ శ్రీనివాసులు, జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు కూండ్ల రమణారెడ్డి, పసుపులేటి సుధాకర్, పట్టణజేఎస్ కన్వీనరు వడ్డెరమణ,రోడ్‌డెవలప్‌మెంట్ స్టేట్‌డైరక్టరు గుల్జార్‌బాష, శరణం కన్‌స్ట్రక్షన్‌కు చెందిన కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- రాజంపేట ప్రాంతీయవైద్యశాల కొత్త శోభను సంతరించుకున్న నేపథ్యంలో జెడ్పీచైర్మన్ ఆకేపాటి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిలు శనివారం నూతనంగా నిర్మించిన భవనాల్లో కలియతిరిగారు. రోగులకు అందించే సేవలను అడిగి తెలుసుకున్నారు.

మల్లయ్యకొండకు రూ.15.04 లక్షల ఆదాయం



వేలంపాటలో ఈవో రమణ తదితరులు

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి దేవస్థానానికి వేలం పాట ద్వారా రూ.15.04లక్షలు ఆదాయం వచ్చింది. శనివారం మల్లయ్యకొండపై ఆలయ కమిటీ చైర్మన్ మల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌కుమార్‌రెడ్డి,ఈవో రమణల ఆధ్వర్యంలో వేలం పాటలు జరిగాయి. ప్రసాదం అమ్మకాలు రూ.6.26లక్షలు, తలనీలాల సేకరణకు రూ.3.50 లక్షలు, గౌరమ్మగుడి పూజకు రూ. 2.15లక్షలు, ఏనుగుమల్లమ్మ పూజకు రూ.1.60లక్షలు, వీరన్నగుహ పూజకు రూ.13500, కొబ్బరిచిప్పల సేకరణకు రూ.50వేలు, టెంకాయలు, పూజా సామాగ్రి అమ్మకం షాపు నిర్వహణకు సంబంధించి రూ.60 వేలకు పాటదారులు పాడుకున్నారు. దీంతో రూ.1540,500ల ఆదాయం వచ్చినట్లు చైర్మన్ తెలిపారు.వాహనాల పార్కింగ్ నిర్వహణ వేలం వాయిదా పడిందని, ఈ నెల29న మల్లయ్యకొండపై బహిరంగ వేలం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.లక్ష ధరావత్తు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కరీమ్, ఆర్‌బీకే చైర్మన్ రెడ్డిమల్ రెడ్డి, శివారెడ్డి, భాస్కర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.3,75,500లు ఆదాయం

రాయచోటి టౌన్: రాయచోటిలో ప్రసిద్ధిచెందిన శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారి ఆలయంలో శనివారం అధికారులు వేలం పాట నిర్వహించారు. వేలం ద్వారా రూ.3,75,500లు వచ్చినట్లు ఆలయ పాలక మండలి అధ్యక్షులు పోలంరెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డిలు తెలిపారు. శనివారం నిర్వహించిన వేలంలో అమ్మవారికి సమర్పించే చీరలు, పంచెలు సేకరించుకొనే హక్కు కోసం రూ.3,63,000కు రఘు, పాదరక్షలు భద్రపర్చుకొనే హక్కు కోసం రూ.12,500కు ఓబులమ్మ దక్కించుకొన్నారని తెలిపారు. తలనీలాలు సేకరణకు సంబంధించి ఎవరూ రాలేదన్నారు. అందువల్ల వేలంపాటను ఈ నెల 2వ తేదికి వాయిదా వేసినట్లు ఆలయ పాలకమండలి సభ్యులు తెలిపారు.

ఎట్టకేలకు దొరికాడు..


సుధాకర్‌నాయుడును కోర్టుకు తీసుకొచ్చిన పోలీసులు

రాజంపేట : 22 ఏళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న నిందితుడు ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. మండలంలోని రోళ్లమడుగు పరిధిలోని నడింపల్లెకు చెందిన సుధాకర్‌నాయుడుపై రాజంపేట రూరల్ పోలీసుస్టేషన్‌లో 2002లో అక్రమంగా ఆయుధం కలిగి ఉన్నాడనే కేసు నమోదైంది. అప్పటి నుంచి అతను కోర్టుకు హాజరు కాకుండా, తప్పించుకుని తిరిగాడు. ఎట్టకేలకు పట్టుకొని శనివారం నందలూరు కోర్టులో హాజరు పెట్టారు. ఈ విషయాన్ని రూరల్ ఎస్ఐ భక్తవత్సలం విలేకర్లకు తెలియజేశారు.

ట్రాక్టర్ ఢీకొని కార్మికుడికి గాయాలు

మదనపల్లె సిటీ : ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతున్న ఓ కార్మికుడిని ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన బి.కొత్తకోటలో శుక్రవారం రాత్రి జరిగింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన విజయ్(26) ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో బండలకు పాలీష్ చేస్తున్నాడు. ఈ క్రమంలో పనులు ముగించుకుని ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా.. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో గాయపడ్డాడు. బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులకు అభయం.. నేరస్తులకు భయం

- సత్ఫలితాలిస్తున్న 'కోర్టు మానిటరింగ్ సెల్'
- పెండింగ్ కేసులకు సత్వర పరిష్కారం
- పోలీస్, న్యాయశాఖల సమష్టి కృషి




కడపలోని పోలీసు కార్యాలయం ఆవరణలోని జిల్లా కోర్టు మానిటరింగ్ సెల్ విభాగం, విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది

కడప అర్బన్ : పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'కోర్టు మానిటరింగ్ సెల్' సత్ఫలితాలిస్తోంది. బాధితులకు సత్వర న్యాయం అందిస్తూ.. నేరస్తులకు వెంటనే శిక్షలు పడేలా చేస్తోంది. పోలీస్, న్యాయశాఖల సమష్టి కృషితో ఇది సాధ్యమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్‌లలో పెండింగ్‌లో వున్న కేసుల్లో త్వరితగతిన శిక్షలు పడేలా పోలీసు శాఖ తరపున కోర్టులకు అనుసంధానం చేస్తూ 2022 ప్రారంభంలో 'కోర్టు మానిటరింగ్ సెల్'ను ప్రతి జిల్లాలోనూ ఏర్పాటు చేశారు.

- 2022 ఆగస్టు 4న వైఎస్ఆర్ జిల్లాలో కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో 'కోర్టు మానిటరింగ్ సెల్'ను ఏర్పాటు చేశారు. 10 ఏళ్లు, అంతకు ముందు నుంచి పెండింగ్‌లో వున్న ప్రధానంగా హత్య, హత్యాయత్నం కేసులు, మహిళలపై జరిగిన తీవ్రమైన నేరాలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. ఈ విభాగంలో ఒక ఇన్‌స్పెక్టర్, ఐదుగురు ఏఎస్ఐలు, 14 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, ముగ్గురు కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తిస్తున్నారు.
- అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 15 హత్య కేసుల్లో ఒక కేసులో మాత్రం ఒకరికి ఉరిశిక్షతో పాటు, 13 కేసుల్లో 39 మందికి యావజ్జీవ కారాగార శిక్ష, ఒక కేసులో 10 ఏళ్లు, మహిళపై హత్యాయత్నం కేసులో ఏడేళ్ల శిక్ష పడేలా కడపలో 8 కోర్టులు, ప్రొద్దుటూరు 2 కోర్టులు, బద్వేలు ఒక కోర్టులో మెజిస్ట్రేట్‌లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు, పోలీస్ అధికారులు తమ వంతుగా కృషి చేశారు. ఈ తీవ్ర స్థాయి నేరాలలో శిక్షలు పడుతుండటంతో నేరస్తుల గుండెల్లో గుబులు రేకెత్తిస్తున్నాయి.
- జిల్లాలో ఫాస్ట్ ట్రాక్ విధానంలో 550 కేసులు గుర్తించారు. వీటిలో 71 కేసులు శిక్షపడినవి, 57 కొట్టివేసినవిగా వున్నాయి.
- అంతేగాక జిల్లాలో కోర్టు మానిటరింగ్ సెల్ ద్వారా త్వరితగతిన విచారణ చేయాలనే ఉద్దేశంతో వివిధ కోర్టుల పరిధిలో పరిశీలిస్తున్న మొత్తం సెషన్స్ కేసులు 1551.
- జిల్లాలో ఈ విధానం ద్వారా శిక్షలు పడిన కొన్ని కేసుల వివరాలిలా వున్నాయి.
- ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మట్టి మసీదు వీధిలో నివసిస్తున్న వక్కల సయ్యద్ హుసేన్, చక్రాయపేటకు చెందిన సయ్యద్ అల్లాబకాష్ కుమార్తె సయ్యద్ యాస్మిన్‌ను 2010లో వివాహం చేసుకున్నాడు. వివాహమైన కొన్ని రోజుల నుంచి అదనపు కట్నం కోసం ఆమెను భర్త మానసిక, శారీరక వేధింపులకు గురి చేసే వాడు. 2014 ఫిబ్రవరి 22న 7వ నెల గర్భవతిగా వున్న భార్య సయ్యద్ యాస్మిన్‌ను రోకలి బండతో తలపై మోది దారుణంగా హత్య చేసినట్లు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో సయ్యద్ హుస్సేన్(39)కు యావజ్జీవ కారాగార శిక్షతోపాటు, రూ. 2.10 లక్షల జరిమానా విధిస్తూ ప్రొద్దుటూరు రెండవ అదనపు జిల్లా కోర్టు జడ్జి జి.ఎస్.రమేష్‌కుమార్ గత ఏడాది మార్చి 23న తీర్పు ఇచ్చారు.
- కడప నగరంలోని రాజారెడ్డి వీధికి చెందిన దిద్దుకుంట లోకేశ్వర్‌రెడ్డి అనే యువకుడు 2014 ఫిబ్రవరి 24న మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా.. లాయం సుధా హరినాథ్‌తో పాటు మురహరి విజయ్‌కుమార్, బాతుల సాయిప్రశాంత్, భీమోళ్ల నరసింహ, ములక లోకోద్ధారరెడ్డిలు సుమోలో వెంబడించి కత్తులు, కొడవళ్లతో దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటనలో నిందితులకు కడపలోని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గల్లా శ్రీదేవి 2023 డిసెంబర్ 29న జీవితఖైదుతోపాటు ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున రూ.15 వేల జరిమానా విధించారు.
- బద్వేలు మండలం చింతలచెరువు గ్రామంలో డిగ్రీ విద్యార్థిని గొడుగునూరు శిరీష (19)ను దారుణంగా హత్య చేసిన కేసులో ముగ్గురు నిందితులకు కడపలోని జిల్లా కోర్టులో ఈ నెల 12న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గల్లా శ్రీదేవి జీవితఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు. అట్లూరు మండలం మాడపూరు పంచాయతీ చిన్నరాజుపల్లెకు చెందిన యువకుడు బాలరాజు చరణ్ కొంత కాలం నుంచి శిరీషను ప్రేమ పేరుతో వేధించసాగాడు. ఆమె నిరాకరించడంతో బాలరాజుచరణ్.. చింతలచెరువుకు చెందిన నాయబ్‌రసూల్, మాడపూరుకు చెందిన పేరుసోముల నరసింహ సహకారం తీసుకుని చంపేశాడు. హతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ప్రధాన నిందితుడు బాలరాజు చరణ్‌కు జీవితఖైదుతోపాటు రూ.3 వేలు జరిమానా, రెండవ, మూడవ నిందితులైన నాయబ్‌రసూల్, నరసింహలకు జీవితఖైదుతోపాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది.

నేరాలు నిరూపించేందుకు కృషి



జిల్లాలో కోర్టు మానిటరింగ్ సెల్ ద్వారా కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తి చేస్తున్నాం. నేరాలను నిరూపించేందుకు తగిన సాక్ష్యాధారాలను కోర్టు ముందు హాజరు పెట్టడం, దర్యాప్తు అధికారులే నేరుగా హాజరై త్వరగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. నేరాలకు పాల్పడాలంటేనే వారిలో భయం కలిగించేందుకు అహర్నిశలు కోర్టు మానిటరింగ్ సెల్‌ను సద్వినియోగం చేస్తున్నాం. - సిద్దార్థ్ కౌశల్, ఎస్పీ

ఈ నెల 13 వరకు జిల్లాలో తీర్పు ఇచ్చిన కేసుల వివరాలు

సంవత్సరం	కొట్టి వేసినవి	శిక్షలు	చనిపోయిన వారివి	వాపసు	మొత్తం
2022	161	4	25	1	191
2023	297	19	–	–	316
2024	–	2	–	–	2
మొత్తం	458	25	25	1	509

కోర్టు మానిటరింగ్ సెల్ ద్వారా పరిశీలిస్తున్న కేసులు

కోర్టు	స్థలం	కేసుల సంఖ్య
పీడీజే కోర్టు	కడప	17
ఫస్ట్ ఏడీజే కోర్టు	కడప	171
4వ ఏడీజే కోర్టు	కడప	379
6వ ఏడీజే కోర్టు	కడప	28
7వ ఏడీజే కోర్టు	కడప	35
పోక్సో కోర్టు	కడప	205
ఏఎస్‌జే కోర్టు	కడప	76
ఏఏఎస్‌జే కోర్టు	కడప	65
రెండవ ఏడీజే కోర్టు	ప్రొద్దుటూరు	125
ఏఎస్‌జే కోర్టు	ప్రొద్దుటూరు	328
ఏఎస్‌జే కోర్టు	బద్వేలు	122
మొత్తం కోర్టులు	పట్టణాలు	కేసులు
11	3	1551

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లాకా వెంగళ రావు పేర్కొన్నారు. బీసీల రాజ్యాధికారం కోసం మరో స్వాతంత్య్ర పోరాట రథయాత్ర ప్రొద్దుటూరు పట్టణానికి శనివారం చేరుకుంది. ఈ సందర్భంగా ఎనీజీ హోంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో 70 కోట్ల మంది బీసీలున్నా ఏ రాష్ట్రంలో కూడా బీసీలకు రాజ్యాధికారం దక్కడం లేదని తెలిపారు. బీసీలు ఒక కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో అభ్యర్థులను నిలిపి గెలుపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నూకాలమ్మ, సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్, బీసీ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సోమా లక్ష్మీనరసయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెన్నా సరళాదేవి, తొగటవీర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, సమాఖ్య స్టేట్ సెక్రటరీ జనరల్ వెంకట రమణ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గురుమూర్తి యాదవ్, రెడ్డెయ్య, కత్తి విజయకుమార్, టి.దుర్గారావు, విజయవాడ టౌన్ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మణరావు, రాష్ట్ర ప్రచార అధ్యక్షులు చింతల కృష్ణ, కడప జిల్లా మహిళా అధ్యక్షురాలు సుభాన్ బీ, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీదేవి, జింకా రాజశేఖర్, గీత, ప్రభుకుమార్, జింకా జయప్రకాష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కడపలో అగ్ని ప్రమాదం

కడప అర్బన్ : కడప నగరం బజాజ్ షోరూం సమీపంలోని తాజ్‌నగర్‌లో వున్న షేక్ మహ్మద్ జావేద్ టింకరింగ్ షెడ్, వెల్డింగ్ షాప్‌లో శనివారం తెల్లవారుజామున 1:30 గంటల సమయంలో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న వెంటనే కడప అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రెండు కార్లు, రెండు ద్విచక్రవాహనాలు, పూర్తిగా పాడైన రెండు వాహనాలు, వీటితోపాటు టింకరింగ్, వెల్డింగ్ షాపుల్లోని సామగ్రి కాలిపోయింది. ఈ అగ్ని ప్రమాదంలో దాదాపు రూ.20 లక్షల మేరకు ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది.

హోటల్‌పై 'విజిలెన్స్' దాడులు


జప్తు చేసిన సిలిండర్లతో అధికారులు

సిద్దవటం : మండల పరిధి మాధవరం-1 గ్రామంలోని హోటల్‌పై విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. కడప రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి షేక్ మాసుంబాషా ఆదేశాల మేరకు కడప విజిలెన్స్, సిద్దవటం ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు కలిసి తనిఖీలు చేపట్టారు. ఆల మల్లికార్జునకు చెందిన హోటల్‌లో 5 గ్యాస్ సిలిండర్‌లను గుర్తించారు. గృహ అవసరాల గ్యాస్ సిలిండర్లను హోటల్‌లో వాణిజ్య అవసరాల నిమిత్తం వాడుతున్నారని విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ జి.ఈదురుబాషా తెలిపారు. వాటిని జప్తు చేసి, హోటల్ యజమానిపై కేసు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో వ్యవసాయాధికారి ఇ.బాలగంగాధరరెడ్డి, సిద్దవటం ఎన్‌ఫోర్స్‌మెంటు డీటీ పి.సౌజన్య, కానిస్టేబుళ్ళు కె.నాగేశ్వర రావు, ఎం.క్రిష్టానాయక్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు దరఖాస్తులు చేస్తే కేసులు

రాజంపేట : ఓటర్ల నమోదులో తప్పుడు దరఖాస్తులు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని రాజంపేట రూరల్ సీఐ మంజునాథరెడ్డి, ఎస్ఐ భక్తవత్సలం శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రాజంపేట మండలం గుండ్లూరు గ్రామపంచాయతీ పోలింగ్‌స్టేషన్ నంబరు 117 పరిధిలో కొందరు ఓటర్లు చనిపోయినట్లుగా ఈసీఐకి ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థనలు నమోదు కావడం జరిగిందన్నారు. దీంతో ఏఈఆర్‌వో క్షేత్ర స్థాయి విచారణ జరిపారన్నారు. రిజిస్ట్రేషన్‌లో 44 మంది బతికి వున్నట్లుగా నిర్ధారించారన్నారు. ఏఈఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. అదే విధంగా నందలూరు మండలం నల్లతిమ్మాయపల్లె పంచాయతీ పోలింగ్ స్టేషన్ నంబరు 88లో కూడా ముగ్గురు వ్యక్తులు బతికి వున్నప్పటికీ.. చనిపోయినట్లుగా తప్పుడు అభ్యర్థనలు వెళ్లాయన్నారు. నందలూరు తహసీల్దారు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపారని తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు తప్పుడు ఫిర్యాదుదారులపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు డీఎస్పీ చైతన్య పర్యవేక్షణలో రెండు కేసులపై విచారణ జరుగుతోందన్నారు. 2024లో జరగబోవు జనరల్ ఎలక్షన్‌లలో భాగంగా ఓటర్ల జాబితా సవరణ కోరడం జరుగుతోందన్నారు. ఇటువంటి తరుణంలో తప్పుడు దరఖాస్తులు ఇచ్చే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వృద్ధుడిపై దాడి

మదనపల్లె సిటీ : ఇళ్ల మధ్యలో మద్యం అమ్మవద్దని చెప్పిన వృద్ధుడిపై ఓ యువకుడు ఇనుప రాడ్‌తో దాడి చేసిన సంఘటన మదనపల్లెలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బార్లపల్లిలో వుండే బాలాజీ ఇళ్ల మధ్యలో మద్యం అమ్ముతున్నాడని పక్కింటి కృష్ణప్ప (75) శుక్రవారం రాత్రి నిలదీశాడు. ఈ క్రమంలో కృష్ణప్పపై బాలాజీ దాడి చేసి గాయపరిచాడు. కృష్ణప్పను కుటుంబ సభ్యులు స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీటిగుంతలో పడి బాలుడి మృతి

వేంపల్లి : మండల పరిధి వీరన్నగట్టుపల్లి గ్రామ సమీపంలోని పాపాఘ్ని నదిలో ఉన్న నీటి గుంతలో పడి ఓ బాలుడు మృతి చెందాడు. వీరన్నగట్టుపల్లి ఎస్టీ కాలనీకి చెందిన శ్రీను కుమారుడు చిన్న(8) తన మేనమామ రమణతో కలిసి శనివారం సాయంత్రం సమీపంలోని పాపాఘ్ని నదిలోకి వెళ్లాడు. రమణ అయ్యప్ప మాల ధరించడంతో.. నదిలో స్నానం చేస్తున్న క్రమంలో చిన్నా కూడా నీటి గుంతలోకి దిగాడు. కొద్ది సేపటికి చిన్నా కనిపించకపోవడంతో రమణ వెంటనే వెతికాడు. నీటి గుంతలో ఇరుక్కున్న బాలుడిని గట్టుపైకి తెచ్చి, వేంపల్లె ఆసుపత్రికి తరలించాడు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వేంపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల నేపథ్యంలో నిఘా ముమ్మరం

కడప అర్బన్ : రానున్న ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో నిఘా ముమ్మరం చేయాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశించారు. శనివారం స్థానిక 'పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్' హాల్‌లో జిల్లాలోని స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి ఎలక్షన్ ఓరియంటేషన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించి వారికి దిశానిర్దేశం చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగే అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు సమాచారం ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌లు కె.అశోక్‌రెడ్డి, జి.రాజు, జిల్లాలోని ఎస్‌బీ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్ట్‌మాస్టర్ చేతివాటం

కమలాపురం : కమలాపురం మండలం పందిళ్లపల్లె పోస్ట్‌మాస్టర్ ఉమా మహేశ్వరి చేతివాటం ప్రదర్శించి దాదాపు రూ.50 లక్షల వరకు ఆర్‌డీ డిపాజిట్‌లు స్వాహా చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాఇయ. పందిళ్లపల్లెతో పాటు సమీప గ్రామాలకు చెందిన దాదాపు 300 మంది వరకు ప్రతి నెల పోస్టాఫీస్‌లో ఆర్‌డీలు కడుతున్నారు. పోస్ట్‌మాస్టర్ ఉమా మహేశ్వరి డిపాజిట్‌దారులు కడుతున్న డబ్బును ఆన్‌లైన్‌లో ఎంటర్ చేయకుండా కేవలం వారి పాస్ బుక్కుల్లో మాత్రమే రాసిస్తూ వచ్చింది. అయితే ఇటీవల మొగల్ మాబున్ని అనే మహిళ తన కుమార్తె వివాహానికి పొదుపు చేసుకున్న డబ్బు డ్రా చేసుకుందామని పోస్టాఫీసుకు వెళితే రేపు, మాపు అని తిప్పుతూ వచ్చింది. అనుమానం వచ్చిన మాబున్ని ఎర్రగుంట్లకు వెళ్లి అక్కడి పోస్టాఫీసులో తన ఖాతా చెక్ చేయాలని చెప్పడంతో ఆ ఖాతా నంబరే లేదని అక్కడి పోస్టాఫీస్ అధికారులు చెప్పడంతో ఫేక్ అకౌంట్ నంబర్ అని తెలుసుకుంది. దీంతో ఆమె ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా, రెండు రోజుల నుంచి పోస్ట్‌మాస్టర్ విధులకు హాజరుకాక పోవడంతో డిపాజిట్‌దారుల్లో ఆందోళన మొదలైంది. తమ ఖాతాలను చెక్ చేసుకోగా అధికశాతం ఫేక్ అని తెలిసింది. శనివారం డిపాజిట్‌దారులంతా పోస్టాఫీస్ వద్దకు చేరుకుని బైఠాయించారు. తమకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వాహన తనిఖీల్లో నగదు స్వాధీనం

కడప అర్బన్ : జిల్లాలోని కడప, కొండాపురంలో శనివారం చేపట్టిన వాహన తనిఖీల్లో పోలీసులు భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. కడప రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పాలకొండలు క్రాస్ వద్ద సీఐ కె.రామచంద్ర, ఎస్ఐ నారాయణ తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. కడప నగరం అక్కాయపల్లెకు చెందిన రియాజ్ అహమ్మద్ కారులో రూ.30 లక్షలు తీసుకుని వెళుతుండగా పట్టుకున్నారు. ఈ నగదుకు ఎలాంటి ఆధారాలతో కూడిన పత్రాలు లేనందున సీజ్ చేశామని, తిరుపతి ఇన్‌కం ట్యాక్స్ అధికారులకు అప్పగించనున్నామని సీఐ వెల్లడించారు.

కొండాపురం : మండల పరిధి తాడిపత్రి- కడప జాతీయ రహదారిలోని ముచ్చుమర్రి గ్రామ సమీపంలో కొండాపురం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఎర్రగుంట్లకు చెందిన సాయి గణేష్‌రెడ్డి కారులో రూ. 8.50 లక్షలు ఉండగా పట్టుకున్నారు. ఆ నగదుకు ఆధారాలు చూపించక పోవడంతో సీజ్ చేశారు. వాహన తనిఖీల్లో ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్, ఎస్ఐ యోగేంద్ర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాచపల్లిలో పశువైద్య బృందం పరిశీలన

విటమిన్ల లోపంతోనే ఆవులు మృతి చెందినట్లు వెల్లడి


మృతి చెందిన ఆవును పరిశీలిస్తున్న పశు వైద్య బృందం, రైతులు

రామాపురం : మండలంలోని రాచపల్లె గ్రామంలో విటమిన్ల లోపంతోనే ఆవులు మృతి చెందినట్లు వైద్య బృందం వెల్లడించింది. ఆ గ్రామంలో వారు శనివారం పర్యటించారు. రాచపల్లెలో నెల రోజులుగా సుమారు 15 ఆవులు మృతి చెందాయి. దీంతో పశువుల యజమానులు శుక్రవారం రామాపురంలోని మూడు రోడ్ల కూడలిలో నిరసన చేపట్టారు. ఇందుకు స్పందించిన వైద్యబృందం శనివారం ఆ గ్రామంలో పర్యటించింది. మృతి చెందిన ఆవుకు పోస్టుమార్టం నిర్వహించారు. ఆవు మృతికి గల కారణాలు గుర్తించారు. విటమిన్లు, కాల్షియం, ఫాస్ఫరస్ లోపమేనని వారు తెలిపారు. ఆ ఆవు ముద్ర నమూనాలను సేకరించి విజయవాడలోని రాష్ట్ర పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలకు పంపినట్లు తెలియజేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి ఇతర పశువుల నుంచి రక్తనమూనాలను సేకరించారు. వాటని ప్రయోగశాలకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో రాయచోటి ఉపసంచాలకులు మాలకొండయ్య, లక్కిరెడ్డిపల్లె ఏడీ బెనర్జీ, జిల్లా వ్యాధి నిర్ధారణ బృందం అధికారి రాంబాబు, మండల పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు రంగారెడ్డి, ఆంజనేయులు, పశువుల యజమానులు, పాడి రైతులు పాల్గొన్నారు.


గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

మదనపల్లె సిటీ : గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె పంచాయతీ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పంచాయతీ పరిధి గాంధీపురం నుంచి మధుసూధన టాకీసుకు వెళ్లే మార్గంలోని శ్మశాన వాటిక వద్ద మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. ఈ మేరకు శనివారం తాలూకా పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం చాల రోజుల కిందటిదిగా తెలుస్తోంది. కుక్కలు అప్పటికే శవాన్ని పీక్కుతిన్నాయి. గుర్తు పట్టలేని విధంగా ఉంది. మృతదేహానికి పసుపు చీర ఉంది. ఎవరైనా అనాథ మృతదేహాన్ని తీసుకొచ్చి ఇక్కడ పడేశారా? లేదా హత్య చేసి ఇక్కడి తీసుకొచ్చి పడేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కాలంలో అదృశ్యమైన కేసులను పరిశీలిస్తే తెలుస్తుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు తాలూకా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బి.కొత్తకోట : నెల క్రితం మరణించినట్టు భావిస్తున్న వ్యక్తి మృతదేహం శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బి.కొత్తకోట మండలం బీరంగి గ్రామం బండెన్నస్వామి ఆలయ సమీపంలోని సుబ్బమ్మ అనే మహిళకు చెందిన సాగులో లేని భూమిలో మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వారు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. జన సంచారం లేని ఈ ప్రాంతంలో నెలక్రితం ఈ మృతదేహం పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. 50 ఏళ్ల వయసు కలిగి ఉండే పురుషుని మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన దశలో ఉండగా.. శరీరంపై ప్యాంటు మినహా మరే ఆధారం లభ్యం కాలేదు. మృతుడి ఆచూకీ గుర్తించేందుకు ఎలాంటి ఆధారం లభించకపోవడంతో పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా నిర్ధారించారు. మదనపల్లె జిల్లా ఆస్పత్రి నుంచి వైద్యులను రప్పించి ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. వీఆర్‌ఓ వరదరాజులు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఏఎస్ఐ బొజ్జెనాయక్ తెలిపారు.

'బాబూ.. దళితులు నీకెప్పుడో దూరమయ్యారు'



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు


మాట్లాడుతున్న నూర్‌బాషా కార్పొరేషన్ రసూల్

కమలాపురం : చంద్రబాబూ.. నీకు దళితులు ఎప్పుడో దూరమయ్యారని, 175 నియోజకవర్గాల్లో ఒక్క చోట కూడా మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదని కాణిపాకం ఆలయ కమిటీ మెంబర్, ఎస్సీ సెల్ నాయకుడు అట్లూరు సుబ్బరాయుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మస్తానయ్య, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాతంగి సుబ్బరాయుడు అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏపీ నడిబొడ్డున విజయవాడలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.400 కోట్లతో 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఇందుకు సీఎంను ఏపీ ప్రజలంతా అభినందిస్తున్నారని తెలిపారు. అలాంటి వ్యక్తిని అంబేడ్కర్ విగ్రహాన్ని తాకే అర్హత లేదని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదం అన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీజీ గంగయ్య, సీకే దిన్నె ఎస్సీ సెల్ మండల కన్వీనర్ కె.మనోహర్ పాల్గొన్నారు.

చంద్రబాబు అబద్ధాలకు హద్దు లేదు

పులివెందుల రూరల్ : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు బుద్ధిలేదు - ఆయన చెప్పే అబద్ధాలకు హద్దు లేదని నూరుబాషా సంఘం కార్పొరేషన్ చైర్మన్ రసూల్ సాహెబ్ అన్నారు. పట్టణంలోని నూరుబాషా సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కమలాపురం టీడీపీ సభలో చంద్రబాబు పులివెందులలో కూడా గెలుస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 1978 నుంచి వైఎస్ కుటుంబీకులు పులివెందులలో ఎమ్మెల్యేగా గెలుస్తూనే ఉన్నారన్నారు. తొండూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పులివెందుల కాంగ్రెస్ నాయకులు పనుల కోసం వచ్చే వారిని పార్టీ కార్యాలయానికి పిలిపించుకుని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, గంగిరెడ్డి, రాజేష్, సంపత్, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.